# జితేందర్‌రెడ్డి X మహేశ్ గౌడ్

**టీవోఏలో వర్గపోరు ● జితేందర్‌రెడ్డి ప్యానెల్‌కు ఐవోఏ షాక్**



హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ ఒలింపిక్ సంఘం(టీవోఏ)లో కాంగ్రెస్ కుంపటి రాజుకుంది. ఈమధ్యే అధ్యక్షుడిగా ఎన్నికైన ఏపీ జితేందర్‌రెడ్డికి, ప్రస్తుత పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా తయారైంది. గత నెలలో జరిగిన టీవోఏ ఎన్నికల్లో అధ్యక్షుడిగా గెలిచిన జితేందర్‌రెడ్డి వర్గానికి భారత ఒలింపిక్ సంఘం(ఐవోఏ) దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. పలు న్యాయపరమైన చిక్కులు దాటి ఎన్నికైన కార్యవర్గానికి ఐవోఏ గుర్తింపు కూడా దక్కలేదు. ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 14 వరకు ఉత్తరాఖండ్‌లో 39వ జాతీయ క్రీడలు జరుగనున్నాయి. సాధారణంగా జాతీయ క్రీడలకు జట్లను ఎంపిక చేసే బాధ్యతను ఆయా రాష్ట్రాల ఒలింపిక్ సంఘాలకు ఐవోఏ అప్పగిస్తుంది. కానీ టీవోఏను గుర్తించని ఐవోఏ..ఈనెల 6న రాష్ట్ర క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్‌కు లేఖ రాసింది. ఇందులో ప్రస్తుత సాట్స్ ఎండీ సోనీబాలదేవిని చెఫ్ డీ మిషన్‌గా ఎంపిక చేస్తున్నట్లు పీటీ ఉష తమ అధికారిక లేఖలో పేర్కొన్నారు. ఆమెకు తోడు టీవోఏ మాజీ కోశాధికారి మహేశ్వర్, ఆర్చరీ సంఘం కార్యదర్శి సంజీవరెడ్డిని డిప్యూటీలుగా నియమిస్తున్నట్లు తెలిపింది. దీంతో ఆయా జట్ల ఎంపిక బాధ్యతను టీవోఏ నుంచి తప్పిస్తున్నట్లయ్యింది. ఎన్నికల్లో ఐవోఏ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కడంతో టీవోఏకు గుర్తింపు దక్కకుండా పోయింది. దీనికి తోడు ఎన్నికల్లో జిల్లా సంఘాలకు ఓటు హక్కు కల్పించడం, ఎలక్టోరల్ కాలేజీ జాబితాలో తప్పులు ఉండటం, జాతీయ స్పోర్ట్స్‌కోడ్‌ను పాటించకపోవడం, ఐవోఏ పరిశీలకుడు లేకపోవడం వంటి కారణాలతో టీవోఏ గుర్తింపునకు నోచుకోకుండా పోయింది. దీనిపై మంగళవారం సమావేశమైన టీవోఏ ప్యానెల్ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. ముగించింది. ఇదిలా ఉంటే అసోసియేషన్ రోజువారీ వ్యవహారాలు నిర్వహించేందుకు ఐవోఏ అడ్‌హక్ కమిటీ ఏర్పాటు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ‘నేనైతే షమీని తీసుకెళ్లేవాడిని’

సిడ్నీ: ఆస్ట్రేలియా పర్యటనలో సీనియర్ పేసర్ షమీని ఆడించి ఉంటే ఫలితం మరోలా ఉండేదని, తానైతే అతడిని తప్పకుండా ఆసీస్‌కు తీసుకెళ్లేవాడినని భారత మాజీ కోచ్ రవిశాస్త్రి అన్నాడు. ‘ఐసీసీ రివ్యూ’లో శాస్త్రి మాట్లాడుతూ.. ‘వాస్తవంగా చెప్పాలంటే షమీ గురించి మీడియాలో జరుగుతున్న ప్రచారం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. అసలు అతడు కోలుకున్నాడా? ఎక్కడ ఉన్నాడు? ఎన్‌సీఏకి వెళ్లాడా? అక్కడ ఎన్నిరోజులు ఉన్నాడు? వీటిపై సరైన సమాచారం ఎందుకు బయటకు రాలేదు? షమీ సామర్థ్యం ఉన్న బౌలర్. నేనైతే అతడిని తప్పకుండా ఆసీస్‌కు తీసుకెళ్లేవాడిని. అక్కడే రిహాబిలిటేషన్‌కు ఏర్పాటు చేసేవాడిని. అతడుంటే జట్టు మరింత బలంగా ఉండేది. మూడో టెస్టు నాటికి అతడు ఫిట్‌నెస్ సాధించకుంటే అప్పుడు అతడిని వదిలేసేవాడిని’ అని అన్నాడు.

## బీజీటీ కంటే కివీస్‌తో క్లీన్‌స్వీపే బాధాకరం

**రోహిత్, కోహ్లీ పుంజుకుంటారు: యువరాజ్**



ఢిల్లీ: బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)లో ఆస్ట్రేలియా చేతిలో 1-3తో సిరీస్ కోల్పోవడం కంటే స్వదేశంలో భారత జట్టు కివీస్ చేతిలో వైట్‌వాష్ అవడమే అత్యంత బాధాకరమని మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ అభిప్రాయపడ్డాడు. బీజీటీ సిరీస్ పరాభవం నేపథ్యంలో యువీ మాట్లాడుతూ.. ‘నా వరకైతే స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో 0-3తో ఓడటమే అత్యంత బాధాకరం. అది ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదు. ఇక ఆసీస్ సిరీస్ విషయానికొస్తే అక్కడ మనం గత రెండు పర్యటనలలో విజయాలు సాధించాం. ఈసారి ఓడిపోయాం’ అని అన్నాడు. ఆసీస్ సిరీస్‌లో రోహిత్, కోహ్లీ వైఫల్యాల తర్వాత వారిపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో యువరాజ్ స్పందిస్తూ.. ‘మన కాలపు గొప్ప క్రికెటర్లలో రోహిత్, కోహ్లీ తప్పకుండా ఉంటారు. వారిపై చాలా చెడుగా మాట్లాడుతున్నారు.త్వరలోనే వాళ్లిద్దరూ మళ్లీ పుంజుకుంటారన్న నమ్మకం నాకుంది’ అని అన్నాడు.

## ‘ప్లేయర్ ఆఫ్ ది మంత్’ రేసులో బుమ్రా



దుబాయ్: టీమ్‌ఇండియా పేసు గుర్రం జస్‌ప్రీత్ బుమ్రా గతేడాది డిసెంబర్ నెలకు గాను ‘ప్లేయర్ ఆఫ్ ది మంత్’ రేసులో నిలిచాడు. పురుషుల విభాగంలో ఐసీసీ తాజాగా విడుదల చేసిన జాబితాలో బుమ్రాతో పాటు ఆసీస్ సారథి పాట్ కమిన్స్, దక్షిణాఫ్రికా పేసర్ డేన్ పీటర్సన్ పోటీలో ఉన్నారు. డిసెంబర్‌లో బుమ్రా 3 టెస్టులాడి 22 వికెట్లతో సత్తా చాటాడు. కమిన్స్.. 3 టెస్టులలో 17 వికెట్లు పడగొట్టగా బ్యాట్‌తోనూ విలువైన పరుగులు చేశాడు. సఫారీ బౌలర్ పీటర్సన్ రెండు టెస్టులలో 13 వికెట్లు సాధించాడు.

## ఏఎఫ్‌ఐ అధ్యక్షుడిగా బహదూర్ సింగ్

చండీగఢ్: భారత అథ్లెటిక్ సమాఖ్య (ఏఎఫ్‌ఐ) అధ్యక్షుడిగా మాజీ అథ్లెట్ బహదూర్ సింగ్ సాగూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శిగా సందీప్ మెహతా, స్టాన్లీ జోన్స్ ట్రెజరర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఇక్కడ జరిగిన వార్షిక సాధారణ సమావేశంలో వారి నియామక ప్రక్రియ పూర్తైంది. సుమరివాలా స్థానాన్ని బహదూర్ భర్తీ చేయనున్నారు.

## త్రిసా-గాయత్రి శుభారంభం

కౌలాలంపూర్: భారత డబుల్స్ జోడీ త్రిసా జాలీ-గాయత్రి మలేషియా ఓపెన్‌లో శుభారంభం చేసింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో త్రిసా-గాయత్రి ద్వయం 21-10, 21-10తో ఒర్నికా-సుకిట్టను ఓడించి ప్రిక్వార్టర్స్‌లోకి వెళ్లింది. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ మ్యాచ్ వర్షం కారణంగా బుధవారానికి వాయిదా పడింది. లక్ష్యసేన్ 14-21, 7-21తో జెన్ చేతిలో ఓడాడు.

# బౌలర్లు కావలెను!



ఆకాశ్ దీప్

సిరాజ్

**స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో అవమానకర పరాభవం, పదేండ్ల తర్వాత బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)ని ఆస్ట్రేలియాకు అప్పగించిన భారత (టెస్టు) జట్టు ఇటీవల కాలంలో ఎప్పుడూ లేనంతగా బలహీనంగా కనబడుతోంది. ముఖ్యంగా ఈ రెండు సిరీస్‌లలో ఓటములకు ప్రధాన కారణం బ్యాటింగ్ వైఫల్యమే అని చెబుతున్నప్పటికీ బుమ్రాను మినహాయిస్తే ప్రత్యర్థి బ్యాటర్లను బెంబేలెత్తించిన.. కనీసం భయపెట్టిన (?) భారత బౌలర్ లేడనేది కండ్ల ముందు కనబడుతున్న వాస్తవం. ముఖ్యంగా ఆసీస్‌తో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇది కొట్టొచ్చినట్టు కనిపించింది. సిడ్నీ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో బుమ్రా ఉండుంటే ఫలితం ఎలా ఉండేదో కానీ అతడు లేకుంటే మన బౌలింగ్ పరిస్థితి దయనీయమనేది సుస్పష్టం.**

*నమస్తే తెలంగాణ క్రీడావిభాగం*

భారత జట్టుకు బౌలర్ల కొరత కొత్తేం కాదు. నాటి కపిల్ దేవ్ కాలం నుంచి నేటి బుమ్రా దాకా ఎవరో ఒకరిమీదే ఆధారపడటం.. ఆ బౌలర్ కాస్తా గాయాల బారిన పడితేనో, ఫామ్ కోల్పోతేనో మిగిలిన బౌలర్లు చేతులెత్తేసి సిరీస్‌లు, ఐసీసీ టోర్నీలు జారవిడుచుకున్న దాఖలాలు కోకొల్లలు! బ్యాటింగ్‌లో ఎంతోమంది మెరికల్లాంటి ఆటగాళ్లు వెలుగులోకి వస్తూ దిగ్గజాలను మరిపిస్తున్నప్పటికీ బౌలింగ్‌లో మాత్రం ఆ లోటు స్పష్టంగా కనిపిస్తోంది. గత దశాబ్ద కాలంలో బుమ్రా, షమీ వంటి బౌలర్ల పుణ్యమా అని ఆ వేధన కాస్త తగ్గినా వీరిలో ఎవరు లేకపోయినా ఫలితాలు జట్టుకు అనుకూలంగా రావడం లేదు. గత రెండు సిరీస్‌లే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. మరి బుమ్రా, షమీ స్థాయిని అందుకునే బౌలర్లను భారత్ తయారుచేస్తోందా? మన బౌలింగ్ బెంచ్ బలమెంత? దేశవాళీలో నిఖార్సైన పేసర్లు ఎంతమంది ఉన్నారు?

### ఆ ఒక్కడు తప్ప..!

ఆసీస్‌తో బుమ్రా ఒక్కడే ఐదు మ్యాచ్‌లలో 32 వికెట్లు తీస్తే.. సిరాజ్, ప్రసిధ్, ఆకాశ్, హర్షిత్ కలిసి తీసింది 35 వికెట్లు. జట్టుకు అవసరమున్న ప్రతిసారీ బుమ్రా వికెట్లు పడగొట్టి భారత్‌ను పోటీలోకి తెచ్చాడు. అయితే మరో ఎండ్‌లో అతడికి సహకారం అందించే బౌలర్లే కరువయ్యారు. సిరీస్‌లో భారత్‌ను బాగా దెబ్బతీసిందిదే. గత రెండు సిరీస్‌లలో బుమ్రాకు అండగా షమీ కంగారూలను బెంబేలెత్తించాడు. నాలుగేండ్ల క్రితం టెస్టు జట్టులోకి వచ్చి ఇప్పటిదాకా 36 మ్యాచ్‌లాడిన సిరాజ్.. ఇప్పటికీ గేమ్ ఛేంజర్ కాలేకపోతున్నాడు. బుమ్రా లేకుంటే అతడి మీద ఆధారపడొచ్చన్న నమ్మకాన్ని జట్టుకు ఇవ్వలేకపోతున్నాడు. విదేశాలలో పేస్ పిచ్‌లను మినహాయిస్తే భారత్‌లో అతడి ప్రదర్శన అంతంతమాత్రమే. సిడ్నీ టెస్టులో ఆడిన ప్రసిధ్.. తరుచూ గాయాల బారిన పడుతూ జట్టులోకి వస్తూ పోతున్నా ఇప్పటికీ అతడు నిలకడగా రాణించలేకపోతున్నాడు. ఆకాశ్, ముకేశ్, హర్షిత్ వంటి బౌలర్లకు అంతర్జాతీయ అనుభవం తక్కువ. ‘సేన’ దేశాలుగా చెప్పుకునే సౌతాఫ్రికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో వీరిని పరీక్షించ లేదు. ఈ బౌలర్లను సానబెడితే గానీ ఫలితాలు ఎలా ఉంటాయనేది చెప్పలేం!



ప్రసిధ్ కృష్ణ

### లెఫ్టార్మ్ పేసర్ ఏడి?

చాలాకాలంగా భారత్‌ను వేధిస్తున్న మరో సమస్య నిఖార్సైన ఎడమ చేతి వాటం పేసర్ లేకపోవడం. అర్ష్‌దీప్ సింగ్ రూపంలో టీ20లలో ఆ కొరత కాస్త తీరినప్పటికీ అతడు ఇంకా వన్డే, టెస్టులలో నిరూపించుకోలేదు. టెస్టులలో అరంగేట్రమే చేయలేదు. యశ్ దయాల్ రూపంలో ఓ ఆప్షన్ ఉన్నప్పటికీ దేశవాళీలో అతడి ప్రదర్శన అద్భుతం అనిపించేంతగానైతే లేదు.

### కుర్రాళ్లను సానబెడితేనే..

ఇప్పటికే జట్టులో చోటు దక్కించుకున్నవారితో పాటు దేశవాళీలోనూ బుమ్రాను మరిపించేంత పేసర్ కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తరఫున అదరగొట్టి బంతిని విసరడంలో కొత్త రికార్డులు నెలకొల్పిన మయాంక్ యాదవ్ ఆశలు కల్పిస్తున్నాడు. కానీ అతడు ఏ మేరకు ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటాడనేది కాలమే నిర్ణయించాలి. అవేశ్ ఖాన్, ముఖేష్ చౌదరి, మోహ్సిన్ ఖాన్, ఉమ్రాన్ మాలిక్ వంటి యువ బౌలర్లను సానబెట్టి వారికి తరుచుగా అవకాశాలు ఇవ్వాలి. ఎవరో ఒకరి మీద ఆధారపడకుండా బెంచ్‌ను పటిష్టంగా తయారుచేసుకుంటే విదేశీ పిచ్‌లపై ప్రధాన బౌలర్లు లేనప్పటికీ సిరీస్‌లు గెలవడం పెద్ద కష్టమేం కాదు.

### అశ్విన్ వారసుడెవరు?

పేస్‌తో పాటు భారత్ బౌలింగ్‌కు ప్రధాన ఆయుధమైన స్పిన్ విభాగంలోనూ లోటు కనిపిస్తోంది. అశ్విన్ రిటైర్మెంట్‌తో ఆ స్థాయిలో ప్రత్యర్థులను తిప్పలు పెట్టే స్పిన్నర్ భారత్‌కు కరువయ్యాడు. రవీంద్ర జడేజా సైతం కెరీర్ చరమాంకంలోనే ఉన్నాడు. వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ రూపంలో స్పిన్ ఆల్‌రౌండర్లు కనిపిస్తుండటం సానుకూలాంశం అయినప్పటికీ దేశవాళీల్లో రాణిస్తున్న తనుష్ కొటియాన్ వంటి స్పిన్నర్లను తీర్చిదిద్దడం ఆవశ్యకం.

## సాగర్‌కు స్వర్ణం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జాతీయ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ లిఫ్టర్ సాగర్ అమృత్‌సింగ్ పసిడి పతకంతో మెరిశాడు. 75కిలోల విభాగంలో పోటీపడ్డ సాగర్ స్క్వాట్‌లో 50కిలోలు, బెంచ్‌ప్రెస్‌లో 65కిలోలు, డెడ్‌లిఫ్ట్‌లో 130కి, మొత్తంగా 245 కిలోలు ఎత్తి అగ్రస్థానంలో నిలిచాడు. 60శాతానికి పైగా వినికిడి సమస్య ఉన్న సాగర్ ఓపెన్ కేటగిరీలో సత్తాచాటడం విశేషం. స్వర్ణం సాధించిన సాగర్‌ను రాష్ట్ర డబ్ల్యూపీసీ పవర్‌లిఫ్టింగ్ అధ్యక్షురాలు రేఖ అభినందించింది.








Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.